ప్రజాశక్తి
సోమవారం 7 ఆగస్టు 2023
5
పార్వతీపురం మన్యం



నేడు జాతీయ చేనేత దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జాతీయ చేనేత దినోత్సవంను సోమవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి ఐ.ధర్మారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని బలిజిపేట మండలం నారాయణపురంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఆయన పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు నారాయణపురం ఆర్.టి.సి బస్ స్టాప్ నుండి నీలకంఠేశ్వర చేనేత సహకార సంఘం వరకు చేనేత ర్యాలీ, అనంతరం సమావేశం జరుగుతుందనిచెప్పారు. అధికారులు, అనధికారులు పాల్గొంటారని ఆయన చెప్పారు.

అప్పు చేసి పప్పు కూడు..!

- దయనీయ స్థితిలో ఆశ్రమ పాఠశాలలు
- ఏడాది నుంచి అందని మెస్ బిల్లులు

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన విద్యాభివృద్ధికి కోట్ల రూపాయలు నిధులు కేటాయించి అభివద్ధిలో పథంలో నడిపిస్తున్నామని పాలకులు, ఉన్నతాధికారులు ఆర్భాట ప్రచారాలు చేస్తున్నా ఆచరణలో ఎక్కడా అమలు కావడంలేదు. ఇందుకు నిదర్శనం పార్వతీపురం ఐటిడిఎ పరిధి గల ఆశ్రమ వసతి గృహాల నిర్వహణకు కనీసం బిల్లులు కూడా చెల్లించలేని దయనీయ స్థితిలో ప్రభుత్వం ఉందంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతుంది. గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు రక్తహీనత లేకుండా సరైన పౌష్టిక ఆహారం అందించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నామని చెబుతున్నా బిల్లులు మాత్రం చెల్లించడంలేదు. దీంతో వసతి గృహాల నిర్వాహకులు, టెండర్లు వేసిన కాంట్రాక్టర్లు అప్పు చేసి మరీ విద్యార్థుల ఆకలి తీర్చుతున్నారు. మరోవైపు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు తనిఖీలు చేసిన సమయంలో మెనూ సక్రమంగా అమలు చేయాలని, నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశాలు జారీ చేస్తారు.. అయితే ఆ దిశగా సరిపడా నిధులు మంజూరులో మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు గతేడాది నుంచి పూర్తిగా మెస్ బిల్లులు చెల్లింపులు నిలిచిపోవడంతో విద్యార్థులకు భోజనం పెట్టేందుకు వార్డెన్లు, టెండర్లు వేసి సరుకులు అందించే వ్యాపారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గతేడాది 11 నెలల పెండింగ్ బిల్లులకు మొదట్లో మూడు నెలల బిల్లులు మాత్రమే చెల్లించారు. మిగిలిన 8నెలల బిల్లులు పెండింగ్లో ఉండడంతో వార్డెన్లతో పాటు సరుకులు అందించే కాంట్రాక్టర్లు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతూ విద్యార్థులకు భోజనం పెడుతున్నారు. అలాగే మండలంలోని ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాల, పెదకేర్జిల గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల, మండల కేంద్రంలో ఉన్న



గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల వసతిగృహం, ఎండభద్ర, కెమిశీల వసతి గృహాల విద్యార్థులకు భోజనాలు పెట్టేందుకు వార్డెన్ నుంచి సరుకులు అందించే కాంట్రాక్టర్లు వరకు అప్పులు చేసి భోజనాలు పెడుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత కురుపాం సబ్ ట్రెజరీగా ఉన్న కొమరాడ మండలాన్ని సాలూరు సబ్ ట్రెజరర్‌గా మార్చడంతో అప్పట్లో బిల్లులు నిలిచిపోయాయి. దీంతో గత ఏడాది విద్యా సంవత్సరానికి సంబంధించి పూర్తిగా బిల్లులు చెల్లించని పరిస్థితి ఏర్పడింది. బిల్లుల చెల్లింపుకాకపోవడంతో అప్పటికే ఇబ్బందిపడిన వార్డెన్లు పిల్లలకు భోజనాలు పెట్టేందుకు దొరికిన చోట జీతాలతో సహా అప్పులు చేసి మరి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. బిల్లులు చెల్లించాలని పార్వతీపురం ఐటిడిఏ కార్యాలయం చుట్టూ వార్డెన్లు ప్రదర్శనలు చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. అధికారులు మాత్రం బిల్లులు పెట్టాం, వస్తాయి ఏదో బాధపడి విద్యార్థులకు భోజనాలు పెట్టండి అంటూ సర్ది చెప్పి పంపిస్తున్నారు తప్ప బిల్లులు చెల్లింపునకు మాత్రం కనీసం చర్యలు చేపట్టడం లేదని పలువురు వార్డెన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది బిల్లుల్లో ఇంకా చెల్లింపులకు రాకపోతే ఈ కొత్త విద్యా సంవత్సరానికి ఇప్పటికే రెండు నెలలు పూర్తయి మూడోనెల భోజనాలు పెడుతున్నామని ఎక్కడ నుంచి అప్పులు చేసినా డబ్బులు సరిపడడం లేదని వసతి గృహాల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు వసతి గృహాలకు సరుకులు అందించే వ్యాపారులు కూడా ఇన్ని నెలలు బిల్లులు చెల్లించకపోతే ఎక్కడి నుంచి డబ్బులు తీసుకువచ్చి పాఠశాలలకు సరుకులు ఇవ్వాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది 8 నెలలతో పాటు ప్రస్తుతం రెండు నెలలు వసతి గృహాల మెస్ బిల్లులు బకాయిలు ఉన్నట్లు వసతి గృహాల వార్డెన్లు తెలిపారు. మొత్తం పది నెలలకు సుమారుగా మండలంలో ఉన్న ఐదు గిరిజన సంక్షేమ వసతి గృహాలకు సుమారు కోటి రూపాయలకు పైగా బిల్లులు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రెండు కోట్ల మేరకు బడ్జెట్ ఉన్నప్పటికీ రాష్ట్ర స్థాయిలో సిఎఫ్ఎంఎస్ అధికారులు బడ్జెట్‌కు ఆమోదం వేయకపోవడంతో నిధులు విడుదల కాకుండా ఉండిపోయింది. కానీ ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కూడా బిల్లులు చెల్లింపునకు పెద్దగా శ్రద్ధ వహించకపోవడంతో వసతి గృహాల నిర్వహణ బిల్లుల పరిస్థితి అధ్వానంగా తయారయ్యిందని వార్డెన్లు వాపోతున్నారు. కొద్దిరోజులు పోతే విద్యార్థులకు కనీసం భోజనాలు పెట్టే పరిస్థితి కూడా కష్టతరంగా మారుతుందని చెబుతున్నారు. ప్రభుత్వ తీరుపై ఇటు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా మండిపడుతున్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు మాట పక్కన పెడితే కనీసం భోజనం పెట్టేందుకు కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం దారుణమన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు ఎంతో అవసరమైన మెస్ బిల్లులు చెల్లింపునకు చర్యలు చేపట్టాలని, వార్డెన్లు, కాంట్రాక్టర్లు ఆదుకోవాలని వసతి గహాల విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పండు

విద్యార్థుల ప్రాణాలు కాపాడండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆశ్రమపాఠశాలల్లో ప్రహరీగోడలు నిర్మించి విద్యార్థుల ప్రాణాలలు కాపాడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.పండు డిమాండ్ చేశారు. మండలంలోని టిక్కబాయి ఆశ్రమ పాఠశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు ఆదివారం సందర్శించారు. అక్కడి పరిస్థితులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డి.పండు మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అమ్మ ఒడి కింద ఇస్తున్న రూ.15000లో ప్రభుత్వం పాఠశాల అభివృద్ధి కోసం రూ.2వేలు ఉపయోగిస్తామని, కోత పెట్టిన ఆ నిధులతో ఎక్కడా మౌలిక వసతులు కల్పించ లేదన్నారు. నాడు-నేడు పనులు ప్రారంభించలేదని, ప్రహరీ గోడలు, తరగతి గదులు, వసతి గృహాల్లేవని అన్నారు. ఇలా సగం సగం అభివృద్ధి చేసిన పాఠశాలల్లో వసతి గృహంలో విద్యార్థులు ఎలా చదవాలని, ఎలా ఉండాలని ప్రశ్నించారు. పాఠశాలలో కిటికీలకు మెస్‌లు లేకపోవడంతో ఆరిక సిద్ధు పాముకాటుకు గురయ్యాడన్నారు. ప్రహరీ గోడ పూర్తిస్థాయిలో లేకపోవడం వల్లే విద్యార్థికి నష్టం జరిగిందని అన్నారు. ఇప్పటికైనా గిరిజన విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అలాగే సిద్ధుకు ప్రభుత్వమే మెరుగైన వైద్యం అందించాలని, ఆశ్రమ పాఠశాలలో వారానికి ఒకసారి మెడికల్ చెకప్ చేయాలని, ఆరోగ్య కార్యకర్తలను నియమించాలని, మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు ఎం.అన్నాజీ, ఎ.గంగారావు, స్థానిక విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ వార్డెన్లుగా ఎస్‌జిటిలే

స్కూల్ అసిస్టెంట్, హెచ్ఎంలు వద్దంటూ ఉత్తర్వులు

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో డిప్యూటీ వార్డెన్ లేదా మేట్రిన్లుగా సంబంధిత పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్జీటీ, పిఇటి, పిడిలనే నియమించాల్సి ఉంటుంది. సబ్జెక్టు ఉపాధ్యాయులైన స్కూల్ అసిస్టెంట్లకు డిప్యూటీ వార్డెన్ బాధ్యతలు అప్పగించరాదు. పాఠశాల హెచ్ఎంలు కూడా డిప్యూటీ వార్డెన్ బాధ్యతలు నిర్వహించరాదని పేర్కొంటూ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో రెగ్యులర్ వార్డెన్లు లేకపోవడంతో ఇంఛార్జి డిప్యూటీ వార్డెన్లుగా పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్, వ్యాయామ ఉపాధ్యాయులకే డిప్యూటీ వార్డెన్లుగా బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుంది. ఆశ్రమ పాఠశాలలో మెనూ అమలుకు సంబంధించిన రికార్డులు, హాజరు పట్టికలు డిప్యూటీ వార్డెన్ల వద్దనే ఉండాలి. డిప్యూటీ వార్డెన్ బాధ్యతలు స్వీకరించని ఎస్జీటీ, పిఇటిలపై చర్యలు తీసుకోనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సబ్జెక్టు ఉపాధ్యాయులైన స్కూల్ అసిస్టెంట్, భాషా పండితులకు ఎట్టి పరిస్థితుల్లోనూ డిప్యూటీ వార్డెన్లుగా బాధ్యత లు అప్పగించకూడదు. ఒక వేళ వారికి అప్పగించినట్లయితే విద్యాప్రమాణాలు దెబ్బ తింటాయని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఆశ్రమ పాఠశాలలో మెనూ అమలు, రికార్డులు, హాజరు పట్టికలు, పిల్లల ఆరోగ్యం, పాఠశాల శుభ్రత వంటి అంశాలపై హెచ్ఎం లే బాధ్యత వహించాల్సి ఉంది. గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలల్లో మహిళా ఎస్జీటీలే డిప్యూటీ వార్డెన్లుగా బాధ్యత నిర్వహించాల్సి ఉంది. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను సంబంధించిన జిల్లా డిడిలే అమలు చేయాల్సి ఉంటుంది. గతంలో కొంతమంది డిప్యూటీ డైరెక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా తమకు నచ్చిన వారిని డిప్యూటీ వార్డెన్లుగా బాధ్యత అప్పగించే సాంప్రదాయం కొనసాగింది. పాఠశాల హెచ్ఎం లకు సహాయకారిగా ఉంటూ డిప్యూటీ వార్డెన్లు వారికి నిర్దేశించిన బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుంది.

ఆందోళనబాటలో ఫెర్రో కార్మికులు



చీపురుపల్లి ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు (ఫైల్)

- విద్యుత్తు భారాన్ని తగ్గించాలంటూ నేడు కలెక్టరేట్ల వద్ద ధర్నా
- ప్రభుత్వం దిగిరాకపోతే నిరసన దీక్షలు, చలో విజయవాడకు కార్యాచరణ

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

రాష్ట్రంలోని ఫెర్రో ఎల్లాయిస్ కార్మికులు ఆందోళన బాటపడుతున్నారు. నిన్నమొన్నటి వరకు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించిన విషయం విదితమే. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఫెర్రో ఎల్లాయిస్ కార్మికులంతా సంఘటితమై ఈ నెల ఒకటో తేదిన విజయనగరంలో కలుసుకున్నారు. సిఐటియు ఆధ్వర్యాన ఎపి స్టేట్ ఫెర్రో ఎల్లాయిస్ వర్కర్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. పరిశ్రమల పరిరక్షణకు స్పష్టమైన డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచినప్పటికీ స్పందించక పోవడం వల్ల ప్రత్యక్ష ఆందోళనల కోసం కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా ఈనెల 7న అన్ని కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేపట్టనున్నారు. అప్పటికీ స్పందించకపోతే వారం రోజులపాటు నిరసన దీక్షలు చేపట్టేందుకు, అనంతరం ఆగస్టు చివరి వారంలో చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు.

రాష్ట్రంలో 36 ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలుంటే, అందులో విజయనగరం జిల్లాలోనే 21 పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో ప్రత్యక్షంగా 60 వేలు, పరోక్షంగా 6 లక్షల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. సుమారు రూ.వెయ్యి కోట్ల మేర జిఎస్‌టి రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వస్తోంది. ఫెర్రో పరిశ్రమల నడకకు విద్యుత్తు వినియోగం చాలా ఎక్కువ. మొత్తం ఉత్పత్తికి అయ్యే ఖర్చులో సగం విద్యుత్తు ఛార్జీలకే చెల్లించాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో గతంలో చాలాసార్లు విద్యుత్తు ఛార్జీలు పెంచినప్పటికీ ఫెర్రో పరిశ్రమలకు మినహాయింపు ఉండేది. కేంద్ర ప్రభుత్వ సంస్కరణల్లో భాగంగా ఇటీవల విద్యుత్తు ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. కార్మికుల ఉద్యోగ, ఉపాధికి ముప్పులేకుండా ఉండాలంటే ఛార్జీల పెంపులో ఫెర్రో పరిశ్రమలకు మినహాయింపు ఇవ్వాలంటూ విద్యుత్తు రెగ్యులేటరీ కమిటీ సమావేశంలో సిఐటియు నాయకులు డిమాండ్ చేసినా వినిపించుకోలేదు. ఈ నేపథ్యంలో మార్చి 31 వరకు ఈ పరిశ్రమలకు యూనిట్ విద్యుత్ ఛార్జీ రూ.4.95 ఉండగా, ఏప్రిల్ ఒకటో తేది నుంచి రూ.8.55కు పెరిగింది. భారం తట్టుకోలేని యాజమాన్యాలు మూసివేతకు సిద్ధమౌతున్నాయి. పెంచిన విద్యుత్తు ఛార్జీల వల్ల ఇప్పటికే విజయనగరం జిల్లాలో బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో 5, గరివిడి ప్రాంతంలో 3, కొత్తవలస ప్రాంతంలో ఒక పరిశ్రమ ఇప్పటికే మూతపడ్డాయి. గరివిడి ఫేకర్‌లో ఐదు యూనిట్లకుగాను ఒక యూనిట్ తగ్గించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి. మూసివేయడం లేదా, పరిశ్రమల్లో ఉత్పత్తిని తగ్గించడం వంటి పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే ప్రభుత్వ వైఖరి వల్ల జ్యూట్, చక్కెర ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. ఫలితంగా సుమారు 50 వేల కుటుంబాలు జీవనోపాధి కోల్పోయాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వంపై ఒత్తిడి చేసి ఫెర్రో పరిశ్రమలను కాపాడాల్సిన మంత్రి బొత్స సత్యనారాయణ.. 'లాభాలు వచ్చినప్పుడు ఎవరికైనా ఇచ్చారా?' అంటూ వ్యాఖ్యానించడం పట్ల యాజమాన్యాలు మండిపడుతున్నాయి. చిత్తశుద్ధి ఉంటే యాజమాన్యాలకు నిర్దిష్టమైన భరోసా ఇవ్వాలని అంటున్నాయి.

జార్ఖండ్‌లో రూ.4కే విద్యుత్తు

వాస్తవానికి విద్యుత్తు ఛార్జీలను పెంచాల్సిన అవసరం లేదు. జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో ఫెర్రో పరిశ్రమలకు అక్కడి ప్రభుత్వాలు యూనిట్‌కు రూ.4 మాత్రమే వసూలు చేస్తున్నాయి. ఖతార్ తదితర దేశాల్లో రూ.3 చొప్పున విద్యుత్తు సరఫరా జరుగుతోంది. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం, కేంద్రంలోని బిజెపి చేపట్టిన సంస్కరణలను రాష్ట్రం అమలుకు పూనుకోవడం వల్లే ఈ సమస్య ఉత్పన్నమౌతోంది. ఇటువంటి చర్యల వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దెబ్బతింటున్నాయి. విద్యుత్తు ఛార్జీల పెంపును ప్రభుత్వం విరమించుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం.

- సిహెచ్ నర్సింగరావు,
సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఆదివాసీ దినోత్సవం రోజును సెలవు దినంగా ప్రకటించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రోబ్బ లోవరాజు కోరారు. ఆగస్టు 9న మన్యం జిల్లాలోని ఆదివాసి గిరిజన సంఘాలనాయకులు, ప్రజా సంఘాలు, గిరిజన ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం నాయకులు స్థానిక హెచ్ గ్రౌండ్ లో నిర్వహించబోయే ఆదివాసి దినోత్సవానికి హాజరుకావాలని కోరారు. ప్రతి ఆదివాసీ పాల్గొని ఈ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి, ఆదివాసి గిరిజన సంఘాల నాయకులు ఇంటికుప్పల రామకృష్ణ, కోలక అవినాష్, సత్యనారాయణ, యడ్ల సూర్యనారాయణ, నిమ్మక సింహాచలం, తిరుపతిరావు, మండంగ రమణ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు లోవరాజు

ప్రవీణ్ ప్రకాశ్ వైఖరి, విద్యాశాఖాధికారుల నిర్ణయాలపై

సమరశీల పోరాటాలకు ఉపాధ్యాయులు సిద్ధం కావాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తూ, విద్యార్థుల వద్ద, సమాజం వద్ద అవమాన పరిచేలా వ్యవహరిస్తున్న ప్రవీణ్‌ప్రకాశ్ వైఖరిని విద్యా శాఖాధికారుల అనాలోచిత ఉత్తర్వులపై ఉపాధ్యాయులంతా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని యుటిఎఫ్ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు మాట్లాడుతూ ప్రవీణ్ ప్రకాశ్ వైఖరి వల్ల ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, దీనివల్ల విద్యార్థులు నష్టపోతున్నారని అన్నారు. ముఖ ఆధారిత హాజరుపై అధికారులు మాట తప్పారని, గతంలో 10 నిమిషాలు గ్రేస్ పీరియడ్ , నెట్ వర్క్ లేని దగ్గర మినహాయింపు ఇచ్చారని, ఇప్పుడేమో నెట్ వర్క్, గ్రేస్ పీరియడ్‌తో తమకు సంబంధంలేదని 9 గంటలకే హాజరు పడాలని, లేనిచో చర్యలు తీసుకుంటామనడం దుర్మార్గమని అన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్ మాట్లాడుతూ ఈనెల 12న ఫ్యాప్టో పోరాటాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వి.జ్యోతి, జిల్లా కార్యదర్శులు కె.మురళి, భాస్కరరావు, వెంకటినాయుడు, కె.కృష్ణారావు, ఎస్.శ్రీరాములు, జానకీరాం పాల్గొన్నారు.

12న కలెక్టరేట్ వద్ద ధర్నా : ఫ్యాప్టో

ఈనెల 12న ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు ఫ్యాప్టో జిల్లా చైర్మెన్ వి.ధనుంజయ నాయుడు తెలిపారు. కార్యక్రమం విజయవంతానికై ఫ్యాప్టో కార్యవర్గ సమావేశం స్థానిక వేదాంత కాలేజీలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ధనుంజయనాయుడు మాట్లాడుతూ, ప్రవీణ్ ప్రకాష్ వైఖరిపైనా, సిఎం హామీలు సిపిఎస్ రద్దు కోసం రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు 12 గంటల ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫ్యాప్టో డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు మాట్లాడుతూ ముఖ ఆధారిత హాజరుపై అధికారులు మోసపూరితంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులను తీవ్రభయాందోళనలకు గుర్తిచేస్తున్నారని అన్నారు. గతంలో 10 నిమిషాలు గ్రేస్ పీరియడ్ ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చారని, అలాగే నెట్ వర్క్ సమస్య ఉన్న దగ్గర మినహాయింపు ఇచ్చారని కాని ఇప్పుడు చర్యలు తీసుకుంటామని ఆదేశాలివ్వడం దుర్మార్గమని అన్నారు. ఈ చర్యలకు నిరసనగా ఈనెల 12న స్థానిక డిఇఒ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీగా వెళ్ళి అక్కడ రాత్రి 9గంట వరకు ధర్నా జరుగుతుందన్నారు. ఈ ధర్నాకు పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశం పిసిహెచ్ శ్రీనివాసరావు, నల్ల బాలకృష్ణ, ఎం.శివున్నాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న యుటిఎఫ్ జిల్లా నాయకులు

రాష్ట్ర యోగాసన పోటీలకు పార్వతీపురం విద్యార్థులు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలకు పార్వతీపురం విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక సూర్యాపీఠంలో జిల్లా యోగాసన స్పోర్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీల్లో విద్యార్థులు ఎంపికైనట్లు అసోసియేషన్ కార్యదర్శి మోహన్ గంజాయిత్ తెలిపారు. 9-14 ఏళ్ల విభాగంలో ఎ. రేవతి, ఆర్.హారిక, పి.సత్యగౌరీ శంకర్, గౌతమ్, 14-18 ఏళ్ల విభాగంలో వై.దీవి, ఎస్, షస్విబీ, వై.నితిన్, జి.మణికంఠ, ఆర్టిస్టిక్ సోలో వై, దేవి, శ్రీ స్వాతి, 18-28 ఏళ్ల విభాగంలో ఎం.సావిత్రి, హేమలత, బి. మొగ్గారావు, ఎం. శ్రీవరణ్ కుమార్ ఎంపికయ్యారు. అలాగే ఆర్టిస్టిక్‌సోలోలో 9-14 ఏళ్ల కేటగిరీలో ఎస్.శ్రీసాయిల, ఎస్.హారిక, కె.చరణ్ సాయి, సాయిలక్ష్మి ఎంపికయ్యారు. అయినట్లు తెలియజేసారు. ఈ యోగా పోటీలో సూర్య పీఠాధిపతి నరహరి శాస్త్రి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ డి.శ్రీదేవి, బోటు రామకృష్ణ, సెక్రటరీ మోహన్ గంటాయత్, వైస్ ప్రెసిడెంట్ రమణ, టి. నాగభూషణం, పరిశీలకులు కెఎన్‌వి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.



పుస్తకాన్ని విష్కరిస్తున్న జెవివి నాయకులు, రచయితలు , ఉపాధ్యాయులు

'భారత ప్రజలమైన మేము' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి రచించిన భారత ప్రజలమైన మేము"అనే పుస్తకాన్ని ఆదివారం స్థానిక గిరిజన కళాభవన్ లో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు ఆవిష్కరించారు. స్నేహితుల సాహితీ, జన విజ్ఞాన వేదిక సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేదిక నాయకులు డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ, రత్న కుమార్, యుటిఎఫ్ నాయకులు ఎస్.మురళీమోహన్, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు భారత రాజ్యాంగం అమలు, ఉల్లంఘన అనే అంశంపై జరిగిన సదస్సులో జన విజ్ఞాన వేదిక నాయకులు ఎంవిఎన్ వెంకటరావు మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగం అమలు కావడం లేదని, ప్రాథమిక హక్కులు లేకుండా పాలకులు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మణిపూర్ మారణహోమం లాంటి సంఘటనలు అసలు నిజాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రిజర్వేషన్లు కూడా ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాజ్యాంగ రక్షణ కోసం కషి, పోరాటం జరగాలని అన్నారు.ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ కు పోరాటం అవసరమని అన్నారు.

రూ.కోటీ 29 వేలతో ఉపాధి పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామంలో రూ.కోటీ29వేలతో వివిధ రకాలైన పనులు చేపట్టినట్లు స్థానిక జడ్పిటిసి జంపు కన్నతల్లి- ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని కత్తుల కవిటిలో 16వ సామాజిక తనిఖీ గ్రామసభ ఆయన మాట్లాడారు. గ్రామస్థాయిలోనే ప్రజలకు ఉపాధి కల్పించడం, పంట కాలువలు, సిసి రహదారులు, తదితరమైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.సరోజిని, ఎంపీటీసీ కొత్తకోట పరిమిల, ఎపిఒ జి.సత్యంనాయుడు, ఎస్ఆర్‌పి ఎం గోవిందరావు, డిఆర్పిలు , గ్రామస్తులు పాల్గొన్నారు.

దుకాణాల కేటాయింపునకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేటలో నూతనంగా నిర్మించిన దుకాణాలను అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు దరఖాస్తులను కోరుతున్నట్లు సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి తెలిపారు. ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతంపేట మెయిన్ రోడ్‌లో గల కమ్యూనిటీ భవనం ఎదురుగా షాపులను నూతనంగా నిర్మించారు. నెలసరి అద్దె రూ.6వేలు ప్రాతిపదికన, గుడ్ విల్ రూ.2లక్షలు డిపాజిట్‌గా కేటాయించినట్టు తెలిపారు. ఆసక్తిగల గిరిజన అభ్యర్థులు ఈనెల 16లోగా దరఖాస్తులు సమర్పించవచ్చని ఆమె వివరించారు. వివరాలకు సీతంపేట ఐటిడిఎ కార్యాలయంలో పని వేళల్లో సంప్రదించ వచ్చని లేదా మొబైల్ ఫోన్ 9392917692 నంబరుకు సంప్రదించ వచ్చని ఆమె పేర్కొన్నారు.

నేడు టిడిపి మండల సమావేశం

ప్రజాశక్తి - సీతానగరం

టిడిపి మండల సమావేశం సీతానగరంలోని కీర్తిశేషులు కొమ్మినేని కిషోర్ ఇంటి వద్ద సోమవారం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్ష కార్యదర్శులు కొల్లి తిరుపతిరావు, రౌతు వేణుగోపాల్ నాయుడు ఆదివారం ఒక ప్రకటన తెలిపారు. ఈనెల 9న చంద్రబాబు పర్యటన సందర్భంగా పర్యటన విజయవంతం చేసేందుకు ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ ద్వారపరెడ్డి జగదీష్, పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బోనెల విజయ్ చంద్ర వస్తున్నారని, కావున మండల పార్టీ సభ్యులంతా సకాలంలో హాజరు కావాలని కోరారు.



వట్టిగెడ్డ నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

సాగునీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలం రావాడ వట్టి గెడ్డ రిజర్వాయర్ కుడి కాలువ సాగు నీటిని ఆదివారం స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి విడుదల చేశారు. ఈ నీరు విడుదల చేయడం ద్వారా ఈ వట్టిగెడ్డ రిజర్వాయర్‌కు దిగువనున్న 16,684 ఎకరాల ఆయకట్టు దారులకు సాగునీరందుతుంది. ఖరీఫ్‌కు సాగునీటి ఇబ్బంది ఉండకుండా పంటలు బాగా పండించు కోవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు ఈ ప్రాంత రైతులు ధన్యవాదాలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డిఇ డి.ఉదయభాస్కరరావు, జెడ్‌పిటిసి ఎం.శశికళ, మండల కన్వీనర్ ఎం.గౌరీశంకర్, వైస్ ఎంపిపిలు, ఇరిగేషన్ ఎఇలు, స్థానిక సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.



చిరంజీవులను పరామర్శిస్తున్న జయమణి, వైసిపి నాయకులు

చిరంజీవులును పరామర్శించిన జయమణి

ప్రజాశక్తి - సీతానగరం

పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులును ఆదివారం మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు సవరపు జయమణి పరామర్శించారు. ఇటీవల చిరంజీవులకు గుండెపోటు రావడంతో అనారోగ్యానికి గురై విశాఖలో ఉన్న ఆయన్ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట వైసీపీ నాయకులు ఎం.మాధవరావు, రాంబాబు, ఎస్.రామారావు, ధనుంజయ్ తదితరులు ఉన్నారు.

వైసిపి నాయకులను పరామర్శించిన రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు వైసిపి నాయకులను డిప్యూటీ సీఎం రాజన్నదొర ఆదివారం పరామర్శించారు. పట్టణంలో వారి నివాసాలకు వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిప్పాడ రామారావు, మాజీ కౌన్సిలర్ ఎర్ర దాలినాయుడు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కస్తూరి రామకష్ణను ఆయన పరామర్శించారు. గత కొద్దిరోజులుగా వారు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న రాజన్నదొర పట్టణ పార్టీ నాయకులతో కలిసి వెళ్లి పరామర్శించారు. సీనియర్ నాయకులు జర్జాపు సూరిబాబు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ ఆయన వెంట వున్నారు.



రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

ప్రమాదం జరిగితే గానీ స్పందించరా?

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రమాదం జరిగితే గాని స్పందించరా అంటూ మండలంలోని చలివేంద్రికి చెందిన ప్రజలు రోడ్లు, భవనాల శాఖ అధికారులపై మండిపడుతున్నారు గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం వద్ద గల కల్వర్టుకు గండిపడి నెలలు గడుస్తూ సమస్య పరిష్కరించాలని ఫిర్యాదు చేసినా కనీసం స్పందించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇదే రహదారి గుండా మహదేవివలస, దశమంతపురం, నర్సిపురం, జిఎంవలస, కురుపాం, జిఎల్ పురం వంటి గ్రామాలకు ప్రధాన రహదారి కావడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆదమరిచే ప్రయాణం చేసిన అంతే సంగతులని పలువురు ఆరోపిస్తున్నారు

ట్రిపుల్ ఐటిలో ఇద్దరు విద్యార్థులకు సీట్లు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన వావిలపల్లి అభిషేక్, బాణాల వర్షితకు ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.ఎల్ పాత్రుడు, ఉపాధ్యాయులు కల్లూరి రవీంద్రలు ఆదివారం తెలిపారు. వీరిద్దరికీ ఒంగోలు ట్రిపుల్ ఐటీ సీటు వచ్చినట్లు తెలిపారు. గరుగుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు రావడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

పార్వతీపురం విద్యుత్తు సబ్‌డివిజన్‌లోనే గరుగుబిల్లి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

పాలకొండ ఎలక్ట్రికల్ సబ్ డివిజన్‌లో విలీనం చేసిన గరుగుబిల్లి మండలాన్ని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి, జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజుల చొరవతో పార్వతీపురం ఎలక్ట్రికల్ సబ్ డివిజన్ పరిధిలో కొనసాగుతుందని ఎంపిపి ఉరిటి రామారావు, ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడులు వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. పార్వతీ పురం ఎలక్ట్రికల్ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న గరుగుబిల్లి మండలాన్ని పాలకొండ ఎలక్ట్రికల్ సబ్ డివిజన్‌లో విలీనం చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఎమ్మెల్యే, శత్రుచర్ల పరీక్షిత్ రాజు దృష్టికి తీసుకువెళ్లా మన్నారు. తక్షణమే స్పందించిన వారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి గరుగుబిల్లి మండలం పాలకొండ డివిజన్‌లో విలీనం చేసిన జీవోను రద్దు చేయించి పార్వతీపురంలో కొనసాగేలా కృషి చేశారని కొనియాడారు. కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

పాఠశాలకు వితరణ

ప్రజాశక్తి- గరుగుబిల్లి

మండలంలోని రావివలస కెజిబివి పాఠశాలకు, స్థానిక గురుకుల పాఠశాలకు విశ్రాంతి ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్ ఎం.చిదంబరం ఆదివారం రెండు లక్షల రూపాయలు విలువ గల సమగ్రిని వితరణగా అందించారు. విద్యార్థులకు అవసరమైన చాపలు, దుప్పట్లు ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని మండలంలోని పిట్లమెట్ట గ్రామానికి చెందిన అంబటి శేషాగిరి రావు దంపతుల తనకు తెలియజేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిసిడిఒ రోజా రమణి, పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రొఫెసర్ చిదంబరం, ప్రొఫెసర్ శేషాగిరి రావుని సన్మానించారు.



ప్రొఫెసర్ చిరదంబరాన్ని సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

నెరవేరనున్న కల...

- పంట పొలాలుగా మారుతున్న బీడు భూములు
- ఆనందోత్సాహంతో గిరిజన రైతులు

ప్రజాశక్తి - వీరఘట్టం

అనేక ఏళ్లుగా వరుణునిపై ఆశలు పెట్టుకొని పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి ఉండేది. తమ ప్రాంతంలో సాగునీటి వసతి ఎప్పుడు వస్తాదనని ఈ ప్రాంత గిరిజనులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వారి కల నెరవేర్చందుకు హైదరాబాద్‌కు చెందిన వాసన్ సంస్థ ముందుకొచ్చింది. ఈ సంస్థ పైప్లైన్ ద్వారా సాగునీరందించేందుకు ఆర్థిక సాయం అందిస్తామనడంతో గిరిజన రైతుల్లో అంతులేని ఆనందం నెలకొంది.

మండలంలో చినగోరకాలనీ సచివాలయం పరిధిలోని మామిడిమానుగోర, చినగోర, కొండవానిగోర గిరిజన గ్రామాల్లో సుమారు వందెకరాలు 57 మంది గిరిజన రైతులు సాగు చేస్తున్నారు. ప్రతి ఏటా వర్షం పైనే ఆధారపడి పంటలు సాగు చేస్తున్నట్లు రైతులు పత్తిక కామేశ్వరరావు, బిడ్డిక సోమిబాబు, నిమ్మక రమేష్, కొండగొర్రె శంకర్రావు, రమణయ్య, ఆరిక త్రినాధరావు, వి.భాస్కరరావు, బిడ్డిక సింహాచలం, ఆదినారాయణ, తదితరులు తెలిపారు. అయితే వర్షాలపై ఆధారపడకుండా పైపులైన్ ద్వారా పంటలు సాగు చేసుకోవచ్చని, వీటికి ఖర్చు తమ సంస్థ భరించుకుంటుందని వాసన్ సంస్థ మండల కోఆర్డినేటర్ కె.రవికుమార్ తెలిపారు. ఇటీవల ఈ గ్రామాల్లో సమావేశం ఏర్పాటు చేసినప్పుడు ఈ మూడు గిరిజన గ్రామాల రైతన్నలతో చర్చించారు. ప్రతి ఏటా వర్షాలపైన ఆధారపడి పంటలు సాగు చేస్తున్నామని, తమకు ఆ అవకాశాన్ని కల్పించాలని రైతులు కోరారు. ఈ మేరకు ఆయన ఈ సమస్యను సంస్థ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఆర్థిక సాయంతో రూ.30 లక్షల అంచనా వ్యయంతో 10ఎంఎంహెచ్‌పి రెండు మోటార్లతో పైపులైన్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. 75శాతం బ్యాంకు భరించుకుంటుందని, 25శాతం రైతులు భరించుకోవాలని పథకం లక్ష్యమని మండల కోఆర్డినేటర్ చెబుతున్నారు. ఈ లెక్కను చూస్తే రూ.22.05 లక్షలు సంస్థ భరించుకుంటుందని, రూ 7.5 లక్షలు రైతులు భరించుకోవాలని గిరిజన రైతులు చెబుతున్నారు.



పంట పొలాలకు పైపులతో వస్తున్న సాగునీరు

అపన్న హస్తం కోసం ఎదురుచూపు

పంట భూములకు సాగునీరందించేందుకు వీలుగా గ్రామాలకు సమీపంలోని గెడ్డల్లో వస్తున్న నీటిని నిల్వచేసి అక్కడ రెండు 10 ఎంఎం హెచ్‌పిలు గల సోలార్ సిస్టంతో పైప్ లైన్ ద్వారా సాగు నీరందించాల్సి ఉంది. ఈ మోటర్లు కొనుగోలు చేసేందుకు ఆర్థికంగా వెనుకబడి ఉన్న నందున సహాయం కోసం గిరిజను రైతులు ఎదురుచూస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కా నిండిన తమ పరిస్థితిని, ఈ పరిస్థితుల్లో ఇంత డబ్బు ఎలా వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు మోటార్లకు గానూ ఒకటి సంస్థ ఏర్పాటు చేసి పైపులైన్ ద్వారా సాగునీరు ట్రయల్ రన్ విడిచిపెట్టారు. పైపుల ద్వారా బీడు భూములకు నీరు రావడంతో గిరిజన రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దాతలు ముందుకొచ్చి ఆర్థిక సహాయం చేస్తే మరో మోటర్‌ను కొనుగోలు చేసి ఏడాదికి రెండు పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఉందని గిరిజన రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రైతుల నుంచి 25శాతం వసూలు చేసింది ఏమైనా సమస్య ఏర్పడినప్పుడు వాటికి ఉపయోగించేందుకు దోహదపడుతుందని మండల కోఆర్డినేటర్ చెబుతున్నారు. ఏర్పాటు చేసిన పరికరాలకు పైసా కూడా రైతన్నలు కట్టనవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.



పొలాల్లో ఏర్పాటు చేసిన పైపులైన్లు

కష్టాలు తప్పనున్నాయి

ప్రతి ఏటా వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్‌కు చెందిన వాసన్ సంస్థ కొంతమేర ఆర్థిక సహాయంతో పంట పొలాలకు పైప్ లైన్ ఏర్పాటు చేయడంతో చెప్పలేని ఆనందం. బీడు భూములు పంట భూములుగా తయారవుతుందని ఊహించలేదు. ప్రస్తుతం పైప్లైన్ ద్వారా సాగునీరు రావడంతో సాగునీటి కష్టాలు తప్పనున్నాయి.

పత్తిక కామేశ్వరరావు
రైతు, చినగోరకాలనీ.

అపన్న హస్తం కోసం ఎదురుచూపు

ఇప్పటికే వాసన్ సంస్థ 75శాతం ఆర్థిక సహాయంతో కొంతమేర పనులు పూర్తి కావచ్చాయి. మిగిలిన 25శాతం రైతులు ఎకరాకి ఎనిమిది వేల రూపాయలు పోగు చేయాల్సి ఉన్నప్పటికీ నిరుపేదలమైన రైతులు కావడంతో ఆర్థిక సాయం చేసేందుకు అపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నాం. ఆర్థిక సహాయం చేసే వారు ముందుకొచ్చి తమ ఆశలు నెరవేర్చాలని కోరుతున్నాం.

ఆరిక త్రినాధరావు,
రైతు, మామిడి మానుగోర

విద్యార్థిని మృతిపై విచారణ జరపాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరపాలని ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొమరాడ మండలం రావికోనకు చెందిన కిల్లక స్వాతి పార్వతీపురం పోస్ట్ మెట్రిక్ బాలికల వసతిగృహం నందు ఉంటూ శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కాలేజీలో బిఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. అయితే ఆ రోజు వరకు వసతి గృహంలోనే ఉంటూ సాయంత్రం తమ గ్రామానికి వెళ్లి ఆత్మహత్య చేసుకోవడంపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఐటిడిఎ పిఒ, కలెక్టర్ స్పందించి గిరిజన విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆదివాసి గిరిజన అభ్యుదయ సంఘం తరపున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

గిరిజన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మలేరియాతో బాధపడుతూ పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రెబ్బ గ్రామానికి చెందిన గిరిజన బాలిక మరియమ్మ, టిక్క బాయి ఆశ్రమ పాఠశాలలో పాముకాటుకు గురై విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న సిద్దుకు మెరుగైన వైద్యం అందించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలలో, వసతి గృహాలు ఆరోగ్య కార్యకర్తలను నియమించాలని, బోధనేతర సిబ్బంది నియామకం చేపట్టాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న డైట్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి : టిడిపి

ప్రజాశక్తి - పాలకొండ

ఈనెల 9,10 తేదీల్లో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు చేపడుతున్న జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ, పరిశీలకులు కలమట సాగర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం టిడిపి సమన్వయ కమిటీ సభ్యులు, క్లస్టర్, యూనిట్ ఇంచార్జు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. సమన్వయ కమిటీ సభ్యులు, క్లస్టర్, యూనిట్ ఇంచార్జులు, ముఖ్య నాయకులతో ఓటర్లు జాబితా సవరణ ప్రక్రియలో బి ఎల్ ఎ ల విధివిధానాలు, "మహాశక్తి" ప్రచార కార్యక్రమం, మినీ "మేనిఫెస్టో"ను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి ఏ విధంగా తీసుకువెళ్లాలన్న దానిపై సమావేశం చర్చించారు. చంద్రబాబు నాయుడు ఈనెల 9,10 తేదీల్లో పార్వతీపురం మొదలుకొని వీరఘట్టం, పాలకొండ మీదగా పాతపట్నం వరకు పర్యటన జరుగుతుంది. ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కర్నెన అప్పలనాయుడు, ఎఎంసి మాజీ చైర్మన్ పుదిలాపు కృష్ణమూర్తి నాయుడు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, వెన్నపు శ్రీను, సుంకరి అనిల్‌దత్, పొన్నాడ నాగేశ్వరరావు, గంట సంతోష్, గండి రామినాయుడు, సీతంపేట సవరతోట మొఖలింగం, భోగాపురపు రవినాయుడు, ఉదయాన ఉదయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన విజయవంతం చేయాలి

గుమ్మలక్ష్మీపురం : పార్వతీపురం మన్యం జిల్లాలో ఆగస్టు 9న పర్యటించనున్న టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు పర్యట విజయవంతం చేయాలని కురుపాం నియోజకవర్గం ఇన్చార్జి తోయక జగదీశ్వరి కోరారు. జియ్యమ్మవలస మండలం చిన మేరంగి కోటలో ఆదివారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కురుపాం నియోజకవర్గంలోని తోటపల్లి ప్రాజెక్టు వద్ద రైతులతో ఇష్టా గోష్టి కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు కురుపాం నియోజకవర్గ పరిశీలకులు ఆరేటి మహేష్, ఐదు మండలాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రధాన పైపులైనుకు మరమ్మతులు

అధికారుల నిర్లక్ష్యమే కారణం
పట్టణంలో దాహం కేకలు

ప్రజాశక్తి -వీరఘట్టం

స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద గల రక్షిత మంచినీటి పథకం ప్రధాన పైపులైను మరమ్మతులకు గురి కావడంతో పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాకు బ్రేకులు పడ్డాయి. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఈనెల 2న రోడ్లు, భవనాల శాఖ అధికారుల అనుమతులు తీసుకొని రాత్రి జెసిబి ద్వారా తవ్వకాలు జరపడంతో అంబేద్కర్ జంక్షన్ వద్ద గల టీ జాయింట్ తవ్వకాల్లో రక్షిత మంచినీటి ప్రధాన పైపులైను పూర్తిగా విరిగిపోయింది. తవ్వకాలు జరుపుతామని మేజర్ పంచాయతీ అధికారులకు కనీసం సమాచారం ఇవ్వకుండా పనులు చేపట్టడం ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల నిర్లక్ష్యమేనని పంచాయతీ అధికారులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు గురువారం మేజర్ పంచాయతీ ఇఒ వి.రామచంద్రరావు దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. రోడ్డుకు అవతల వీధులకు, రోడ్డుకు ఇవతల తాగునీటి సరఫరాకు కావాల్సిన ప్రధాన పైపులైను టీ జాయింట్ దగ్గర దెబ్బ తినడంతో పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా నిలిపివేశారు. ప్రధాన పైపు మెటీరియల్ విశాఖ నుంచి రప్పించి ఈనెల నాలుగో న మరమ్మతులు చేపట్టి యధావిధిగా తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మేజర్ పంచాయతీ ఇఒ తెలిపినా, నేటికీ పనులు పూర్తి కాలేదు. దీంతో పట్టణ ప్రజలు తాగునీటి కోసం తీవ్ర అవస్థలుపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే పైపులైను మరమ్మతులు చేపట్టి తాగునీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



దెబ్బతిన్న పైపులైను

జయరాజును పరామర్శించిన జెసి నాయకులు

ప్రజాశక్తి - కురుపాం

నాగూరు మాజీ ఎమ్మెల్యే, నిమ్మక జయరాజు అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నం కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న నేపథ్యంలో కురుపాం నియోజకవర్గ గిరిజన జెఎసి నాయకులు తాడంగి రామారావు, హిమరిక నీలకంఠం, బిడ్డక రామారావు ఆదివారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వీరితోపాటు కురుపాం నియోజకవర్గ జెసి నాయకులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలు సక్రమంగా అమలు చేయాలి : భూదేవి

ప్రజాశక్తి - సీతంపేట

ఆదివాసీల కోసం ప్రత్యేకమైన చట్టాలు రాజ్యాంగంలో పొందుపర్చినప్పటికీ అమలు చేయటంలో ప్రభుత్వాలు అలసత్వం చూపుతున్నాయని గిరిజన నేత పడాల భూదేవి అన్నారు. ఆదివారం సీతంపేటలో దండకారణ్య వియోచన సమితి ఆధ్వర్యంలో మణిపూర్ ఘటనకు నిరసనగా ఎన్టీఆర్ పార్క్ నుంచి సామాజిక భవనం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం సామాజిక భవనంలో రాష్ట్ర కమిటీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూదేవి మాట్లాడుతూ గిరిజనుల కోసం ప్రత్యేకమైన చట్టాలున్నప్పటికీ అమలు చేయడంలో ప్రభుత్వాలు అలసత్వం చూపుతున్నాయని విమర్శించారు. గిరిజన ప్రజాప్రతినిధులు చట్టసభల్లో ప్రశ్నించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. జిఒ 3 రద్దుపై ఒకరు కూడా స్పందించలేదన్నారు. అలాగే ఎస్టి జాబితాలో ఇతరులను చేర్చే కుట్రను పార్టీ లు తలపెడుతుంటే అడ్డుకోవల్సిన ప్రజాప్రతినిధులు మద్దతు తెలపటం దుర్మార్గమన్నారు. గిరిజనులకు అన్యాయం జరుగుతున్న తరుణంలో గిరిజన సంఘాలు ఉద్యమించాలని సూచించారు. ఇప్పటికే గిరిజన సంఘ నాయకులపై తప్పుడు కేసులు బనాయించి ఉద్యమాన్ని అణగదొక్కాలని చూస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు బి.ఉమామహేశ్వరరావు, హేమలత, పాలక పురుషోత్తం, బి.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టడానికే

చంద్రబాబు పర్యటన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ప్రాజెక్టులపై యుద్ధ భేరి పేరుతో చంద్రబాబు నాయుడు ప్రాంతాల మధ్య విద్వేషాన్ని రగిలిస్తూ, స్థానికంగా ఎక్కడికక్కడ టిడిపి కార్యకర్తలను రెచ్చగొడుతున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారం కోసం బరితెగిస్తూ రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చాలని ఒక క్రూర ఆలోచనతో ప్రతిపక్ష నేత ఉన్నారని అన్నారు. శనివారం చిత్తూరు జిల్లా పుంగనూరు ఘటనలతో చంద్రబాబు చేస్తున్న కుట్రలు, కుతంత్రాలు పరాకాష్టకు చేరాయని, హింసను ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. అంతటినీ రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని 2024లో తప్పక బుద్ధి చెప్పి తీరుతారని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపిపిలు సిద్దా జగన్నాధ రావు, బంకూరు రవికుమార్, ఎంపిపి ప్రతినిధి మజ్జి శేఖర్, వైసిపి సీనియర్ నాయకులు భీమవరపు కృష్ణమూర్తి, యాళ్ల ఈశ్వరప్రతాప్, యాల్ల శ్రీరాములు, త్రినాధ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ సింహాచలం

మొక్కల పెంపకంతోనే కాలుష్య నివారణ

ప్రజాశక్తి - సీతానగరం

మొక్కల పెంపకంతోనే కాలుష్యాన్ని నివారించవచ్చునని మండలంలోని జోగింపేట సర్పంచ్ కడియంపూడి సింహాచలం అన్నారు. ఆదివారం జోగింపేటలో రోడ్డుకు ఇరుపక్కల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ద్వారా మొక్కలను పెంచేందుకు సరఫరా చేస్తున్న మొక్కలను రోడ్డుకు ఇరువైపులా పెంచడంతో మంచి వాతావరణం, స్వచ్ఛమైన గాలి వస్తుందన్నారు. ఇప్పటికే గ్రామాన్ని ఆనుకొని ఉన్న చెరువుగట్లు పెంపకాన్ని, సంపదని కూడా చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీ ఉన్నారు.



వాణిజ్య సముదాయాన్ని శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

వాణిజ్య సముదాయంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక మున్సిపల్ వాణిజ్య సముదాయంలో పారిశుధ్య పనులను అధికారులు ఆదివారం చేపట్టారు. ఈనెల 5న ప్రజాశక్తిలో ప్రచురితమైన ఆదాయం మిన్న... నిర్వహణ సున్న.. అనే వార్తకు స్పందించిన మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు ఆదేశాల మేరకు ప్రజారోగ్య అధికారి సిహెచ్ మురళి పారిశుధ్య కార్మికులచే మునిసిపల్ ఐడిఎస్‌ఎంటి వాణిజ్య సముదాయంలో పారిశుధ్య పనులు చేయించారు. ఈ సముదాయంలో ఉన్న పశువులు, కాయగూరల వ్యర్థాలను తొలగించేందుకు తొలగించి శుభ్రం చేయడంతో వాణిజ్యసముదాయంలోని వ్యాపారులతో పాటు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అయితే వాణిజ్య సముదాయానికి కనీస నిర్వహణ బాధ్యతలు చేపట్టి, సముదాయం లోపలి ప్రాంతం పశువుల సంచారం లేకుండా గేట్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని సంబంధించిన దుకాణాల యజమానులు కోరుతున్నారు.



వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న సర్పంచ్ రాధాకృష్ణ

దోమల నివారణ మందు స్ప్రేయింగ్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ఏగోటివలసలో దోమల నివారణకు స్ప్రేరింగ్ చేయించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కురిటి రాధాకృష్ణ మాట్లాడుతూ ముందు జాగ్రత్త చర్యగా కాలువల్లోనూ, నీటి గుంటల్లో, నిల్వ ఉండచోట దోమలను నివారించేందుకు గ్రామం మొత్తం స్రేయింగ్ చేస్తున్నామన్నారు. దీంతో పాటు బ్లీచింగ్ కూడా చల్లడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం బి.రమాదేవి, ఎంఎల్‌హెచ్ హరిప్రియ, ఆశా కార్యకర్త కె.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రజ్జిలిలో మహాశక్తి

ప్రజాశక్తి - కురుపాం

మహిళల భవిష్యత్తు భరోసా కావాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అవ్వాలని టిడిపి సీనియర్ నాయకులు బి. పద్మావతి అన్నారు. మండలంలోని ఏగులువాడ పంచాయతీ రజ్జిలి గిరిజన గ్రామంలో మహాశక్తి కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆ గ్రామ మహిళలకు టిడిపి ప్రవేశపెట్టిన మహాశక్తి పథకం గురించి అవగాహన కల్పించారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థికే ఓటు వేసి గెలిపించాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు దమయంతి

నేరాలు ఘోరాలు

పాముకాటుతో అస్వస్థత

ప్రజాశక్తి - కురుపాం

పాముకాటుతో ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన ఆదివారం గుమ్మలక్ష్మీపురం మండలంలో చోటుచేసుకుంది. గొరడ గ్రామానికి చెందిన తోయక సుందరరావు(40) పొలం పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా ఆకస్మాత్తుగా పాము కాటేసింది. దీంతో ఆయన అస్వస్థతకు గురికాగా గమనించిన కుటుంబసభ్యులు సమీపంలో ఉన్న రేగిడి పీహెచ్సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కురుపాం సీహెచ్సీకి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఇక్కడ చికిత్స పొందుతున్నాడు ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలోని ధూళికేశ్వర ఆలయం సమీపంలో రహదారి గుంతలను తప్పించబోయి ద్విచక్ర వాహనంతో అదుపుతప్పి ఎన్.సత్యనారాయణ (52) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు కింద పడిపోయిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈయన కురుపాం ఎంఇఒ విధులు నిర్వహిస్తున్నారు. వెంటనే కొందరూ విద్యార్థులు ఆయనను కురుపాం సిహెచ్‌సికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం తరలిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.